క్లుప్తంగా

10న జాబ్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్డీఏ, సీడాప్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు న్యాక్ కోఆర్డినేటర్ నాగవిఘ్నేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18సంవత్సరాల నుంచి 30సంవత్సరాల వయసు ఉండి 10వ తరగతి, ఇంటర్, డిగ్రి, డిప్లమో, ఐటీఐ, బి.టెక్, పీజీ అభ్యర్థులు అర్హులన్నారు. ఈ మేళాలో 10 కంపెనీలు ఉద్యోగవకాశాలు కల్పిస్తాయన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు.

వాహనాల తనిఖీ

డోన్ రూరల్ : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం ఎంవీఐ క్రాంతికుమార్ వాహనాలను తనఖీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని తొమ్మిది వాహనాలకు రూ. 47వేలు జరిమానా విధించారు.

జాతీయ పోటీలకు డోన్ విద్యార్థి


దత్తమునిస్వామి

డోన్ టౌన్: ఇండియా ఇంటర్ గేమ్స్ థర్డ్‌కెలో స్కైస్నో రోలింగ్ పోటీల్లో పాల్గొనేందుకు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి దత్తమునిస్వామి ఎంపికై నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి తెలిపారు. 18వ తేది వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న దత్తమునిస్వామి శుక్రవారం కళాశాలలో అభినందనలు తెలపడంతోపాటు ఖర్చుల నిమిత్తం అధ్యాపకుడు రామన్న రూ. 5వేలను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌సీహెచ్.కన్నా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ ప్రతాప్ అన్నారు. సంజామల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గోస్పాడుకు బదిలీ అయిన ఉసేనయ్యకు శుక్రవారం సాయంత్రం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ, పదవీ విరమణ సర్వసాధారణమన్నారు. అనంతరం ఉసేనయ్యను సిబ్బంది పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: నునుసురాళ్ళ సబ్ స్టేషన్‌లో శనివారం అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని మల్యాల, యు.కొత్తపల్లె సబ్ స్టేషన్లకు కరెంటు నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ గ్రామాలకు వ్యవసాయానికి సంబంధించి తెల్లవారు జామున 4గంటల నుంచి 1గంట వరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1గంట నుంచి సాయిత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు కాశీ విశాలాక్షి, విశ్వేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల : మండల పరిధిలోని రహిమానుపురంలో వెలసిన కాశీ విశాలాక్షి, విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాగశుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని శ్రీకాశీ విశాలక్షి, విశ్వేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్న ముద్దుస్వామి తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని 5వ తేదీ నాలుగుపండ్ల వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా తర్వాతి స్థానాల్లో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.6 వేలు, రూ. 5వేలు, రూ.3 వేలు చొప్పున అందజేస్తామన్నారు.

అర్హత ఉంటే పథకాలు వర్తిస్తాయి


శరత్‌కుమార్‌కు పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

డోన్ రూరల్ : అర్హత ఉంటే తప్పకుండా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని కామగానికుంట్ల సర్పంచ్ రాధమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వేమారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కామగానికుంట్ల గ్రామానికి చెందిన హరిజన శరత్‌కుమార్ అనే వ్యక్తికి కొన్నేళ్ల నుంచి మూడు వేల రూపాయలు పింఛన్ వచ్చేది. అతడు పూర్తిగా నడచలేని స్థితిలో ఉండటంతో గ్రామంలో జనవరి12న జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీపీ బాధితుడు నడవలేని స్థితిలో ఉన్నందున ఐదు వేల రూపాయల పింఛన్‌కు అర్హుడిగా గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారుడు శరత్‌కుమార్ ఇంటికి వెళ్లి రూ. 5 వేలు పింఛన్ అందించారు. సందర్భంగా పింఛన్‌దారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


అంబాపురంలో రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి బుగ్గన,


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి రూ. 95.50 లక్షలతో పూర్తయిన నూతన రహదారి శిలాఫలకాన్ని శుక్రవారం మంత్రి బుగ్గన ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మమ్మ, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు చంద్ర శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామ్ మోహన్ రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, తిమ్మరాజు, మద్దిలేటి స్వామి, మహేంద్ర తదితరులతో కలిసి మంత్రి బుగ్గన నూతన రహదారిపై ఆ గ్రామం వరకు పాదయాత్ర చేశారు. గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో రహదారి కిటకిటలాడింది. పాదయాత్రగా వస్తున్న మంత్రిని రైతులు, వ్యవసాయ కూలీలు తరలివచ్చి పలుకరించారు. ఈ సందర్భంగా బుగ్గన కూలీలతో కొద్దిసేపు ముచ్చటించారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు.

ప్రతి హామీనీ అమలు చేస్తున్నాం...

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. రోడ్డును ప్రారంభించి పాదయాత్రగా అంబాపురం చేరుకున్న మంత్రి ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ముచ్చట్ల మల్లికార్జునస్వామి రహదారి నుంచి అంబాపురం గ్రామం మీదుగా యాగంటి, మద్దిలేటి స్వామి ఆలయాల క్రాస్ రోడ్డు వరకు రహదారి వేయించాలని గ్రామస్తులు మంత్రికి విన్నవించగా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, అర్హులైన పేదలందరికీ న్యాయం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి బుగ్గన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, మండల నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ఖాజా, గూని నాగరాజు, గూటుపల్లె, గోరుమానుకొండ, ఎంపీటీసీ నాగశేషు, వైస్ ఎంపీపీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణానికి భూమిపూజ

- హాజరుకానున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, టీటీడీ ఆలయ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం డోన్ మండలంలో పర్యటించనున్నారు. ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన స్తోత్రం గుండాల లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.5కోట్లతో నిర్మిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ అధికారి ధర్మారెడ్డితో కలిసి మంత్రి భూమిపూజ నిర్వహిస్తారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, కోట్రాయి సర్పంచ్ తేజోమణి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం డోన్ పట్టణానికి చేరుకొని 44వ జాతీయ రహదారి సమీపాన టిడ్కో గృహ సముదాయం పక్కన రూ.3.5కోట్లతో నిర్మిస్తున్న మరో టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి వారు శంఖుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

కోవెలకుంట్ల: మండలంలోని మూడు గ్రామాల్లో శనివారం నుంచి మూడు రోజులపాటు కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సెర్ప్, వెటర్నరీ, ఉద్యానవన, మల్బరీ, హౌసింగ్ శాఖలకు సంబంధించి చేపట్టిన పనులను పరిశీలిస్తారన్నారు. 4వ తేదీ ఉదయం అమడాల, మధ్యాహ్నం గుంజలపాడు, 5వ తేదీన సౌదరదిన్నె గ్రామాల్లో కేంద్రబృందం పర్యటిస్తుందని వెల్లడించారు. ఆయా శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం రాజ్యలక్ష్మిదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నంద్యాల గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో జరిగిన అండర్‌-14 త్రోబాల్ విభాగంలో సంజీవ రాయుడు మొదటి స్థానంలో నిలిచారన్నారు. అండర్ 17 విభాగంలో మౌనిక ద్వితీయ స్థానం కైవసం చేసుకుందన్నారు. అలాగే కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన హరిత సత్తాచాటిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గౌడు, ఉపాధ్యాయులు దేవేంద్ర, నాగరాజు, ఓబయ్య, తులసీశ్వరరెడ్డి, వసంతలక్ష్మి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలి

- హౌసింగ్ ఎస్ఈ నాగభూషణం


జగనన్నకాలనీలో అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎస్ఈ నాగభూషణం

డోన్ టౌన్: జిల్లాలో ప్రభుత్వ గృహ నిర్మాణాలను వచ్చే ఉగాది నాటికి వందకు వంద శాతం పూర్తి చేయాలని, లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని ఎస్ఈ నాగభూషణం అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని దొరపల్లె, ఉడుములపాడు జగనన్న కాలనీల్లో ఆయన హౌసింగ్ పీడీ శేషుబాబు, ఈఈ ప్రభాకర్, డీఈ రాజశేఖర్‌తో కలిసి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు వెంట వెంటనే బిల్లులు, ఇసుక, సిమెంట్ తదితర సామగ్రిని జాప్యం లేకుండా అందజేయాలని సూచించారు. గృహనిర్మాణాలు చేపట్టకుంటే పట్టాలను రద్దు చేస్తామని, ఇప్పటికైనా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు గృహ నిర్మాణాల్లో నంద్యాల జిల్లాలో డోన్ రెండవ స్థానం ఉందని, మొదటి స్థానానికి తీసుకరావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డోన్ హౌసింగ్ ఏఈలు నాగభూషణం, వీరేంద్ర, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందివర్గం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, కుర్ని కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు వీరంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు తదితరులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపలో కాటసానికి ఆయా కుటుంబాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూల మాలలు వేసి సత్కరిస్తూ ఆహ్వానించారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధి వివరాలను చదివిన ఎమ్మెల్యే ఆ మేరకు పథకాలు వర్తించాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ తమకు అర్హత మేరకు సంక్షేమ పథకాలు వర్తించాయని ఎమ్మెల్యేకు సంతోషంగా తెలిపారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు. ఇంత వరకు గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులను వివరిస్తూ ఇంకా అవసరమైన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ జిల్లాలోనే ఏ నియోజకవర్గంలో లేని విధంగా మన నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీరాజ్,ఆర్‌డబ్ల్యూఎస్, మేజర్ ఇరిగేషన్ పరిధిలోని జీఎన్ఎస్ఎస్ కెనాల్ లైనింగ్ పనులు అవుకు టన్నెల్‌-3, అవుకు రిజర్వాయర్ నుంచి పెద్ద వెంతుర్ల వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ వెడల్పు, తెల్లపూరి గ్రామం నుంచి గుళ్లదూర్తి గ్రామం వరకు కుందూనది వెడల్పు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.2500 కోట్ల మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ,పీఆర్ ఏఈ రమణ తదితర అధికారులతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సంట్టిన్న,సుబ్బరాయుడు,నడిపి మద్దిలేటి,ఎస్ సుధాకర్, నాగరాజు, వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ్‌భాస్కర్


డోన్ రూరల్ : ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయ్ భాస్కర్ సూచించారు. మండల పరిధిలోని వెంకటనాయునిపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన మెనూను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు ఈయన సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అరుణ్ కుమార్, విశ్రాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సాయివాణి, ఆరోగ్య కార్యకర్తలు రాజకుమారి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్యాపిలి: మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్ సుమిత్ర, మహానంది పరిశోధన స్థానం శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీధర్ సూచించారు. మండల పరిధిలోని పెద్దపొదిళ్ల గ్రామంలో శుక్రవారం మామిడి రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిలో పూతమొగ్గ దశ నుంచి గోలికాయ దశ వరకు నెలవారీగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం నల్లపూత దశలో తేనె మంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు వ్యాప్తి చెందవచ్చన్నారు. సస్యరక్షణ చర్యల్లో భాగంగా థయోమిథాక్సం 0.3 గ్రాములు, థయోఫినెట్ మిథైల్ 1 గ్రాము చొప్పున ఫిబ్రవరి 15 నుంచి 25 వ తేదీ మధ్యలో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు కళ్యాణి, షేక్షావలి, రైతులు రామచంద్రారెడ్డి, పెద్ద రామిరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ


రైతు గ్రూపు సభ్యులతో ఏఓ పవన్‌కుమార్

కొలిమిగుండ్ల: వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం కింద కమ్మువారిపల్లె, పెద్దవెంతుర్ల గ్రామాలకు చెందిన రైతులకు శుక్రవారం యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. రెండు గ్రామాల రైతులకు 13 విత్తన గొర్రులు, రెండు పవర్ స్ప్రేయర్లు అందించామని పవన్‌కుమార్ తెలిపారు. అంతకుముందుగా కమ్మువారిపల్లె గ్రామ సచివాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి,సభ్యులు పాల్గొన్నారు.

నేడు నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెలో రూ.90 లక్షలతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని శనివారం ప్రారంభిస్తునట్లు తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలుతో పాటు రెవెన్యూ సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక వీరభద్రఫంక్షన్ హాలులో ఈ నెల 5వ తేదీన నిర్వహించ తలపెట్టిన గృహసారధుల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గృహసారథులు, కన్వీనర్లదే కీలకపాత్ర అన్నారు. ఆదివారం నిర్వహించే సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ అఫ్జల్‌ఖాన్, జిల్లా అబ్జర్వర్ అమర్నాథరెడ్డి తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గజ్జెలరెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన నాగరాజు

అవుకు: మండల పరిధిలోని శింగన పల్లె గ్రామంలో ఓ యువరైతు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శింగనపల్లెకు చెందిన బిరుసంటి రైతు నాగరాజు(31) తన మూడు ఎకరాల భూమిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే నాలుగేళ్లుగా పంటల దిగుబడి సరిగా రాకపోవటంతో రూ.5లక్షలు అప్పు అయ్యింది. అప్పుల బాధ తట్టుకోలేక మనస్థాపం చెంది ఇంటిలోనే గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంతులు చేసుకుంటుండంతో భార్య మౌనిక గమనించి వెంటనే బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వృద్ధుడు మృతి

బేతంచెర్ల: స్థానిక రైల్వే స్టేషన్ సమీపాన శుక్రవారం తెల్లవారుజామున రైల్వే ట్రాక్ దాటుతూ ఓ వృద్ధు డు ప్రమాదవశాత్తూ కిందపడి అక్కడి అక్కడే మృతి చెందాడు. సంజీవ నగర్ కాలనీకి చెందిన వృద్ధు డు రామిరెడ్డి (80) మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో పట్టణంలోకి వచ్చి తిరిగివెళ్లే క్రమంలో రైల్వే స్టేషన్ సమీపాన ట్రాక్ దాటాక కిందపడి మరణించారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వృద్ధుడి మేనల్లుడు మహేశ్వర్ రెడ్డి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించారు.

ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు మృతి

డోన్ టౌన్: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా హాస్టల్ కన్వీనర్ బాణాల హనుమంతు(30) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హనుమంతు కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయిత్రం మృతి చెందారు. ఈయన మృతి పట్ల బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొత్తకాపు హేమ సుందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు సందు వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే మహారాజ్ సంతాపం తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎఎస్ఐ లింగమయ్య తెలిపారు. డోన్ పట్టణం కొండపేటకు చెందిన వెంకటేశ్వర్లు, ఆర్ ఎస్‌రంగాపురం గ్రామానికి చెందిన మనోహర్‌ను అదుపులోకి తీసుకొని మట్కా చీటీలతో పాటు, రూ.3500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు


బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షల చేస్తున్న డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, విద్యతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్, బీసీ గురుకుల పాఠశాల, బీసీ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ శంకరుడు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు యోగ, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎస్ఎం గ్రేసమ్మ,స్టాఫ్‌నర్సు స్లీవా ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సీఐ ప్రియతం రెడ్డి, పోలీస్ సిబ్బంది

బేతంచెర్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్లో సీఐ ప్రియతం రెడ్డి, ఏఎస్ఐ లింగమయ్య ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ఫ్లెక్సీని విడుదల చేశారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వ్యసనానికి గురైన వ్యక్తి పోలీసులచే పట్టుబడితే పదేళ్ల కఠిన కారగార శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయా కూడలల్లో, విద్యా సంస్థల ఎదుట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

కొలిమిగుండ్ల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని లిటిల్ ఫ్లవర్, ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో డగ్స్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో చాలా అనర్థాలు కలుగుతాయన్నారు. కష్టపడి చదువుకొని తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు.

అన్నివర్గాల అభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బందర్లపల్లె ముస్లిం కుటుంబాలు


టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన బందర్లపల్లె ముస్లిం కుటుంబాలతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో కొలిమిగుండ్ల మండలం, బందర్లపల్లె గ్రామానికి చెందిన 22 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. హుస్సేన్‌పీరా, గౌస్ మొహిద్దీన్, మహమ్మద్, హుస్సేన్‌బాషా, హాజీవలి, డీష్‌వలీ, హుస్సేన్‌వలి, షేక్షావలి,నంద్యాల బాషా, బుడెన్‌సా, మస్తాన్‌వలి, హుస్సేన్‌సా, రెడ్డిపల్లిబాషా, ఖాసీం, జాకీర్, గోరుమానుపల్లె మహమ్మద్, వలి, నబీరసూల్, మహమ్మద్‌సా, బాషు, ఆటో నూర్‌బాషా, రజాక్ తదితరులకు ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ బందర్లపల్లె ముస్లిం సోదరులకు గతంలోనే శ్మశానవాటికను కేటాయించామని గుర్తు చేశారు. ముస్లిం పెద్దల విన్నపం మేరకు శ్మశానవాటిలో బోరుతో ప్రహరీ, రంజాన్, బక్రీద్ పర్వదినాల్లో నమాజ్ చేసుకునేందుకు ఈద్గాను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ మద్దతుగా ఉండి 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బందర్లపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాతం వెంకట శివ రామిరెడ్డి, యాతం వీరగోపాల్‌రెడ్డి, దేవేంద్రారెడ్డి, మక్కల వెంకట రాముడు, ఉయ్యాల మనోహర్‌రెడ్డి, పెద్దకృష్ణ, మల్లికార్జున,రాజా,దేరంగుల తదితరులు పాల్గొన్నారు.